సాక్షి గుంటూరు

శనివారం, 23, ఆగస్టు, 2025



కనకదుర్గమ్మకు బోనాలు

రెంటచింతల: మండలంలోని పాలువాయి జంక్షన్ శివదుర్గ కాలనీలో కనకదుర్గమ్మ వారికి శుక్రవారం బోనాలు సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



ట్రస్టు తరఫున అన్నదానం

మాచర్ల: పట్టణంలోని అనాథలు, వృద్ధులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు తరఫున శుక్రవారం అన్నదానం చేశారు. నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బూర్గులమ్మకు ప్రత్యేక పూజలు



రేపల్లె: శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకుని గ్రామ దేవత బూర్గులమ్మ వారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని కనులారా దర్శించుకున్నారు.


న్యూస్‌రీల్

మహంకాళీ అమ్మవారికి వెండిపళ్లెం కానుక



దుగ్గిరాల/తెనాలి: దుగ్గిరాల మండలంలోని కంఠంరాజు కొండూరులో గల శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానానికి తెనాలివాసులు రూ.1.50 లక్షల విలువైన కిలోన్నర వెండి పళ్లెంను శుక్రవారం సమర్పించారు. స్థానిక బాలాజీ రావుపేటకు చెందిన బొందలపాటి శ్రీకాంత్, గీత, రజనీకాంత్ చౌదరి, అనూష, శివకుమార్, జశ్వితాచౌదరి, గవిని శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఈ కానుక సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,026 క్యూసెక్కులు ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్ కాలువకు 246, బ్యాంక్ కెనాల్‌కు 1,631, తూర్పు కాలువకు 613, పశ్చిమ కాలువకు 250, నిజాపట్నం కాలువకు 407, కొమ్మూరు కాలువకు 2,640 క్యూసెక్కులు, బ్యారేజి నుంచి సముద్రంలోకి 4,16,662 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం



అమరావతి: పవిత్ర శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని స్థానిక అమరేశ్వ రాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ రేఖ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలోని దక్షిణాన అమ్మవారిని ప్రత్యేక వేదికపై అలంకరించి, ముత్తయిదువులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం వారు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ కోమిటినేని నాసరయ్య, రాజ్యలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈవో ఎస్.మాధవీ దేవికి ఈ మొత్తాన్ని చెక్ రూపంలో అందించారు. కార్యక్రమంలో అర్చకులు కొత్తలంక కార్తికేయశర్మ, నండూరి కాశీకృష్ణ పాల్గొన్నారు.


వైభవంగా శ్రావణ శుక్రవార పూజలు



నరసరావుపేట ఈస్ట్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్జీఓ కాలనీలోని అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్ప ఆలయం, మహాలక్ష్మీ అమ్మవారు, పాలపాడు రోడ్డులోని శ్రీ చిన్న సింగరకొండ ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

దివ్యాంగులపైనా
కూటమి కర్కశం

దివ్యాంగులనే కనికరం చూపని కూటమి కర్కశత్వానికి నిదర్శనంగా పింఛన్ల రద్దు నిలుస్తోంది. అందరిలా పని చేసుకోలేక అవయవలోపాలతో సతమతం అవుతున్న వారిపైనా నిర్దయగా వ్యవహరిస్తోంది చంద్రబాబు సర్కారు. గతంలో ఇచ్చిన పింఛన్లు రద్దు చేస్తున్నామంటూ మానవత్వం మరిచి మరీ నోటీసులు జారీ చేసింది. ఏం చేయాలో దిక్కుతోచని బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



అడ్డగోలుగా పింఛన్ల తొలగింపుతో బాధితుల ఆవేదన

- జిల్లాలో 2,521 మందిని అనర్హులుగా పేర్కొంటూ ఎగనామం పెట్టిన సర్కార్
- మంచం దిగలేని స్థితిలో ఉన్నవారినీ వదలని చంద్రబాబు ప్రభుత్వం
- పాలకుల తీరుపై మండిపడుతున్న దివ్యాంగులు, వారి కుటుంబసభ్యులు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై కక్ష గట్టింది. పింఛన్ తీసేశామంటూ వేలాది మంది దివ్యాంగులకు చంద్రబాబు ప్రభుత్వం నోటీసులిచ్చింది. ఉరుములేని పిడుగులా ఈ కఠిన చేదు వార్త విని దివ్యాంగుల గుండె పగిలింది. మూడు రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా దివ్యాంగులకు వరుసగా నోటీసులు అందుతున్నాయి. పింఛన్లపై ఆధారపడి జీవిస్తున్న వారు ఏం చేయాలో దిక్కుతోచక అధికారులను వేడుకుంటున్నారు. తమ గోడు వినమని కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మంచంపై ఉన్న వారికి కూడా పింఛన్ల తొలగించడంతో దివ్యాంగులు, వారి కుటుంబసభ్యులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. వైకల్య శాతం ఎక్కువ ఉన్నా కూడా డాక్టర్లు తగ్గించి నివేదికలు అడ్డగోలుగా రాశారని వాపోతున్నారు.

జిల్లాలో భారీగా తొలగింపు

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు జిల్లాలో 23,459 మంది దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. ఇందులో 2,521 మందికి ప్రస్తుతం తొలగించారు. మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులు 479 మంది ఉంటే.. వారిలో 32 మందిని అనర్హులన్నారు. 2,521 మందికి మొండిచేయి చూపారు. రూ.15 వేలు పింఛన్ తీసుకునే దీర్ఘకాలిక రోగుల కేటగిరీ నుంచి 472 మందిని తొలగించి.. దివ్యాంగుల విభాగంలోకి మార్చారు. ఏడుగురికి వృద్ధాప్య పింఛన్ కింద రూ.4 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. రూ.6 వేలు తీసుకునే 388 మందిని వృద్ధాప్య పింఛన్ కిందకు మార్చి రూ.4 వేలు ఇచ్చేందుకు నోటీసులు జారీ చేశారు.

మూగ, చెవుడైనా పింఛన్ రద్దు



వందశాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ | ఇప్పుడు 40 శాతం కంటే తక్కువట..



బధిరుడు కుమార్

గుంటూరుకు చెందిన కుమార్ అనే దివ్యాంగుడి తల్లి మాట్లాడుతూ... 'మా బాబు పుట్టుకతోనే మూగ, చెవుడు కావడంతో ఎన్నో అప్పులు చేసి కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయించాం. ప్రస్తుతం బాబుకు రూ.6 వేలు పింఛన్ వస్తోంది. దాంతోనే ట్రీట్‌మెంట్ జరుగుతోంది. గతంలో వంద శాతం వైకల్యం ఉందని డాక్టర్లు సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు 40 శాతంకంటే తక్కువ ఉందని నోటీసులు ఇచ్చి పింఛన్ ఆపేస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసం' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా మమ్మల్ని ఇబ్బందులు పెడితే ప్రభుత్వానికి ఏం ఉపయోగం అని ప్రశ్నించారు. అధికారుల తీరుతో ఆవేదన తప్పడం లేదని వాపోయారు.

ఇంజినీరింగ్ అధికారులపై సీరియస్

- 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ కమిషనర్ స్పందన
- గత సంవత్సరంలో జరిగిన పనుల వివరాలు ఇవ్వాలని ఆదేశం
- ఆప్కాస్ ఉద్యోగిపై చర్యలకు ఇప్పటికే రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థలో తమ్ముళ్ల దోపిడీపై కమిషనర్ స్పందించారు. ఏడాది కాలంలో జరిగిన అన్ని పనుల వ్యవహారంపై దృష్టి సారించారు. టెండర్లలో పాల్గొనకుండానే పాల్గొన్నట్లు నకిలీ డాక్యుమెంట్లు పుట్టించి వర్కులు చేసుకోవడంతోపాటు, లెస్ పేరుతో మాయాజాలం చేసి కార్పొరేషన్ ఆదాయాన్ని తమ్ముళ్లు రూ.కోట్లలో లూటీ చేశారనే అంశంపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'రూ.కోట్లలో తమ్ముళ్ల లూటీ!' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం చాలా సీరియస్ అయినట్లు సమాచారం. గత సంవత్సర కాలంలో జరిగిన వర్కుల పూర్తి వివరాలు, ఎంబుక్ రికార్డింగ్, బిల్స్ పేమెంట్ తదితరాలను 24 గంటల్లో తనకు సమర్పించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డ్రాయింగ్ బ్రాంచ్ హెడ్ డ్రాఫ్ట్‌మేన్ (హెచ్‌డీ)ని ఆదేశించారు. ఇందులో అవకతవకలు గుర్తించినట్లయితే సంబంధిత ఆప్కాస్ సిబ్బందిపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం క్లిప్

అన్ని అంశాలపై విచారణ: కమిషనర్

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లలో పాల్గొన్న అంశంపై నిజాలు తెలుసుకునేందుకు విచారణ చేపడుతున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. లెస్ వేసిన టెండర్ల విషయంలోనూ వచ్చిన ఆరోపణలపై విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. టెండరు రిజిస్ట్రేషన్ కాలపరిమితి పూర్తయినప్పటికీ టెండర్‌లో పాల్గొన్న సందరు కాంట్రాక్టర్ దాఖలు చేసిన టెండర్లు రద్దు చేసి వాటికి తిరిగి పిలుస్తామని తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగిపై చర్యలు?

టెండర్లలో పాల్గొనకుండా పాల్గొన్నట్లు డాక్యుమెంట్లు సృష్టించి వర్కులు చేసుకుంటున్న విషయం గత కొద్ది రోజులుగా ఇంజినీరింగ్ విభాగంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం అధికారులు దృష్టికి వెళ్లడంతో డ్రాయింగ్ బ్రాంచ్‌లో పనిచేసే ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గత పది రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో ఇంజినీరింగ్ సెక్షన్‌లో ప్రకంపనలు మొదలయ్యాయి. ఈ విషయం సీరియస్ అయితే ఎవరి మీద వేటు పడుతుందోననే భయాందోళనలో ఉద్యోగులు ఉన్నారు. ఈ విషయంతో లింకులు ఉన్న ఆప్కాస్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో పాటు సదరు ఉద్యోగిని మూడు నెలలపాటు నగరపాలక సంస్థ కార్యాలయం పరిసర ప్రాంతాల్లోకి కూడా రావొద్దంటూ ఇంజినీరింగ్ అధికారులు సూచించడంతో ఫోన్ సిచ్ఛాఫ్ చేసి వేరే ఊరు వెళ్లినట్లు సమాచారం.

నృసింహాలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ప్రాంగణం

మంగళగిరి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మంగళగిరి నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. మహిళలు వేకువజామునే ఇళ్లను, పూజ గదులను శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ సమక్షంలో అర్చకులు వ్రతాలను నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి తిరుమంజన సేవ జరిగింది. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు.



రాజ్యలక్ష్మి అమ్మవారికి తిరుమంజన సేవ చేస్తున్న దృశ్యం

స్వామి వారి వస్త్రాలు వేలం....

ఆలయంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. పట్టుచీరలు 43, ఫ్యాన్సీ చీరలు 387, పంచెలు 37 విక్రయించగా రూ.91,150 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

సర్వే శాఖ చాంబర్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం



కూలిన చాంబర్ పైకప్పు

గుంటూరు వెస్ట్: జిల్లా సర్వే శాఖ ఏడీ పవన్ కుమార్, సిబ్బంది త్రుటిలో పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సర్వే శాఖ ఏడీ చాంబర్‌లోని పైకప్పు కూలిపోయింది. కొన్ని నిమిషాల ముందు వరకు పవన్ కుమార్‌తోపాటు సిబ్బంది కిషోర్ కుమార్, రవితేజ అక్కడే పలు అంశాలపై చర్చించారు. తర్వాత జేసీ భార్గవ్ తేజను కలిసేందుకు బయటకు వెళ్లారు. ఆ సమయంలో జూనియర్ అసిస్టెంట్ హసన్ షరీఫ్, అంటెండర్ సంతోషమ్మ ఫైలు తీసుకునేందుకు ఏడీ చాంబర్‌లోకి వెళ్లారు. కొద్దిగా శబ్దం రావడంతో ఇద్దరూ బయటకు వచ్చేశారు. వెంటనే భారీ శబ్దంతో పైకప్పు మొత్తం కూలిపోయింది. సిబ్బంది బయటకు పరుగెత్తారు. ఏడీ చాంబర్‌లోని టేబుల్ సహా చాలా సామగ్రి ధ్వంసమైంది. ఎప్పుడో 115 సంవత్సరాల క్రితం బ్రిటీషు కాలంలో కట్టిన కార్యాలయం కావడంతో సిబ్బంది మరమ్మతుల కోసం విజ్ఞప్తి చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. కార్యాలయంలో కూర్చోవాలంటేనే సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘ నాయకులు కోరుతున్నారు.

గుంటూరు చానల్‌కు మరమ్మతులు

- కృష్ణా నది నుంచి నీటి సరఫరాను నిలిపివేసిన యంత్రాంగం
- తాగునీటి కోసం ప్రత్యామ్నాయాలపై స్థానిక అధికారుల దృష్టి

మంగళగిరి: గుంటూరు చానల్‌కు కాజ వద్ద జరుగుతున్న మరమ్మతుల కారణంగా కృష్ణా నది నుంచి నీటిని ఆపారు. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజారోగ్య శాఖ జేఈ ప్రసన్న తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థకు తాగునీరు సరఫరా చేసే మంగళగిరి మండలంలోని ఆత్మకూరు వద్ద కల గుంటూరు చానల్‌ను, తాగునీటి పథకాన్ని జేఈ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుంటూరు చానల్ మరమ్మతుల కారణంగా మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థతో పాటు గుంటూరు నగరం, మరికొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వెల్‌లోని నీటిని వాడుకోవడంతోపాటు సీతానగరం నుంచి గుంటూరు వెళ్లే పైపులైన్ల నుంచి ఎంటీఎంసీకి నీటిని తీసుకుని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గుంటూరు చానల్‌కు మరమ్మత్తులు దాదాపు పూర్తి కావచ్చినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారని వివరించారు. ఆ పనులు పూర్తయిన వెంటనే చానల్‌కు నీరు సరఫరా అవుతుందని తెలిపారు.



గుంటూరు చానల్‌లో తగ్గిపోయిన నీటి ప్రవాహం

ఐదు మండలాలకు ఇదే కీలకం

గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఐదు మండలాలకు సాగు, తాగునీటిని గుంటూరు చానల్ ద్వారా అందిస్తున్నారు. కృష్ణా నది వద్ద ప్రకాశం బ్యారేజీ నుంచి 47 కిలోమీటర్ల పొడవున ప్రవహించి సాగు, తాగునీటి అవసరాలను ఈ చానల్ తీరుస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పెదకాకాని, గుంటూరు కార్పొరేషన్, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల ప్రజలు తద్వారా లబ్ధి పొందుతున్నారు. మొత్తం 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా.. వరి, మిరప, పత్తి, అపరాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి 4 టీఎంసీలు సరఫరా అవుతుండగా.. 3.2 టీఎంసీలు సాగుకు, 1.42 టీఎంసీలను తాగునీటికి వినియోగిస్తున్నారు. ఐదు మండలాల్లోని గ్రామాలలోని ట్యాంకులకు ఈ తాగునీరు అందుతోంది. ఇటీవల వర్షాలకుతోడు కొండవీటివాగు వరదను ఈ చానల్‌లోకి మళ్లించడంతో గండ్లు పడి వేలాది ఎకరాలోపంట నీటమునిగింది. మరోవైపు గుంటూరు చానల్‌పై కాజ - నంబూరు మధ్య వంతెన సహా పలు చోట్ల ఉన్నవి శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికే అంతంత మాత్రంగా సరఫరా అవుతున్న నీరు ఈ వంతెన వద్ద ఏ చిన్న ఘటన జరిగినా పెద్దసంఖ్యలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కాజలోని వంతెన

శాంతించిన కృష్ణమ్మ

ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాలు

భట్టిప్రోలు: కృష్ణమ్మ శాంతించింది. దీంతో లంక గ్రామాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద దిగువకు శుక్రవారం మధ్యాహ్నం 4.32 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. మండలంలోని ఓలేరు, పల్లెపాలెం, పెదలంక కాకుల డొంక వద్ద వరద తగ్గుముఖం పట్టింది. పొలాల్లో నిలిచిన నీరు వెనక్కి వెళుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు చర్యలు చేపట్టారు. చప్టాలపై నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను, నాటు పడవలను అందుబాటులో ఉంచారు. వీఆర్వోలు, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ, మండ్రు జక్రయ్య, ఎల్.సురేష్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు.



భట్టిప్రోలు మండలం ఓలేరు-పెసర్లంక వద్ద చప్టాపై తగ్గిన వరద నీరు

ఆచార్యా.. అర్హులను ఎంపిక చేయండి

- ఏఎన్‌యూ తీరుపై అభ్యర్థుల ఆందోళన
- నిబంధనలు పాటించకుండా ఎంపిక చేయడంపై తీవ్ర ఆగ్రహం
- అధికారులను నిలదీస్తే రిక్రూట్‌మెంట్ కమిటీ నిర్ణయం అంతిమమని జవాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యంత్రాంగం తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతన్నాయి. ఫార్మసూటికల్ కళాశాలలో అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో ఆచార్యుని నియామకం కోసం జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. జూలై 19న ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 మందికి కాల్ లెటర్స్ అందగా, 14 మంది హాజరయ్యారు. సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ తోపాటు 15 సంవత్సరాలు బోధన అనుభవంలో కనీసం ఐదేళ్లు ప్రొఫెసర్ లేదా సీనియర్ ప్రొఫెసర్‌గా అనుభవం ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఆ ఇద్దరికి ఉద్యోగాలు ఎలా ఇస్తారు?

నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక జరుగుతోందని అభ్యర్థులు ఆందోళన చెందుతూ శుక్రవారం వర్సిటీలోని హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్, రిజిస్ట్రార్, వైస్ చాన్సలర్‌లను కలసి ఫిర్యాదు చేశారు.



అర్హులను కాదని ఐదేళ్ల ప్రొఫెసర్ అనుభవం కూడా లేని, పీహెచ్ విద్యార్థిని గైడ్ చేయని మహిళకు ఆ పోస్టు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికార పార్టీ సామాజిక వర్గానికే చెందడమే ఆమె అర్హతగా చెబుతున్నారు. మరోవైపు ఒక పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చి రెండు పోస్టులకు భర్తీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కృష్ణాజిల్లా సిద్ధార్థ ఫార్మసీ కళాశాలకు చెందిన దేవినేని హిరణ్మయి, సింగరాయకొండ మలినేని ఫార్మసీ కళాశాలకు చెందిన తేజోమూర్తిని ఎంపిక చేసినట్లు ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై రిక్రూట్‌మెంట్ కమిటీ నియమించడం జరిగిందని, దాని నిర్ణయమే అంతిమం అని రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 2,800

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,538
అమ్మకాలు	49,099
నిల్వ	7,830

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–13,500
నంబరు–5	10,000–13,200
273	10,000–13,000
341	10,000–14,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,800
నంబరు–5	10,000–13,500
341	11,000–15,000
4884	10,000–13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ–355	10,000 – 14,000
దేవనూరు డీలక్స్	10,000 – 13,500
ఆర్మూర్	9,800 – 11,500
తాలుకాయలు	6,000 – 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,500
బాడిగ – 355	10,000–13,500
దేవనూరు డీలక్స్	10,500–13,600
తాలు	5,300 – 7,200

–కొరిటెపాడు (గుంటూరు)

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ఇండియా స్కిల్స్ కాంపిటేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

గుంటూరు వెస్ట్: పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చే వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి మార్గాలు పెరగాలన్నా, ఆర్థిక ప్రగతి కావాలన్నా వ్యవసాయంతోపాటు పరిశ్రమల స్థాపన కూడా ఎంతో ముఖ్యమన్నారు. నూతన పరిశ్రమల స్థాపన కోసం వచ్చే దరఖాస్తులను సింగిల్ విండో విధానంలో పరిష్కరించాలన్నారు. లోటుపాట్లు ఉంటే అధికారులు గైడ్ చేయాలని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అధికారులు త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు దేవదాయ శాఖతో సమన్వయం చేసుకుని సంబంధిత భూములను ఏపీఐఐసీకి అందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రుణాలు మంజూరు కీలకం

జిల్లాలో ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యాపార విస్తరణకు అవసరమైన రుణాలు బ్యాంకుల ద్వారా అందించాలని సూచించారు. వాణిజ్య, వ్యాపారవేత్తల నైపుణ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఆర్‌ఏఎంపీ వర్క్‌షాప్‌లో వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం ద్వారా శిక్షణ పొందిన చేతివృత్తిదారులకు టూల్ కిట్స్ అందజేయడంతోపాటు అవసరమైన వారికి వ్యాపార సంస్థల ఏర్పాటుకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో ఎంఎస్‌ఎంఈలకు సంబంధించి ప్రోత్సాహకాల కింద 24 క్లెయిమ్స్‌కుగాను రూ. 1.37 కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎ.జయలక్ష్మి, డీడీ మధుసూదనరావు, కమర్షియల్ టాక్స్ డీసీ మనోరమ, డీఆర్డీఏ పి.డి. టీవీ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, జిల్లా నైపుణ్య అధికారి సంజీవరావు, ఇతర జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

యువత వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

గుంటూరు వెస్ట్: యువత వృత్తి నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే ఉపాధి మార్గాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ఇండియా స్కిల్స్ కాంపిటేషన్ 2025 పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 30వ తేదీలోపు పోటీకి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, నిర్మాణం తదితర మొత్తం 63 నైపుణ్య ట్రేడ్‌లపై పోటీ నిర్వహిస్తారన్నారు. జనవరి 1, 2001 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎ.జయలక్ష్మి, డీడీ మధుసూదనరావు, కమర్షియల్ టాక్స్ డీసీ మనోరమ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- చలానాలు అవసరం లేదని స్పష్టీకరణ



నగరంపాలెం: వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్లు, మండపాలు, ఊరేగింపులు నిర్వహించేందుకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఎటువంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలని సూచించారు. ఉత్సవాలు నిర్వహించే వారు కమిటీగా ఏర్పడాలని అన్నారు. వెబ్‌సైట్‌లో క్లిక్ చేసి అనుమతులు పొందాలన్నారు. తొలుత మొబైల్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తయ్యాక తర్వాత దరఖాస్తు విండో ఓపెన్ అవుతుందని అన్నారు. దరఖాస్తు సమర్పించిన తర్వాత స్థానిక పోలీసులు ప్రాంగణాన్ని పరిశీలించి, అనుమతులు ఇస్తారని వివరించారు.

దరఖాస్తులో నమోదు చేయాల్సినవి

- దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నంబర్, ఈ మెయిల్, చిరునామా, అసోసియేషన్/కమిటీ పేరు.
- గణేష్ మండపం స్థలం, విగ్రహం/మండపం ఎత్తు.
- పోలీస్ సబ్ డివిజన్, పోలీస్‌స్టేషన్ పరిధి
- ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు.
- గణేష్ నిమజ్జనం తేదీ, సమయం, వాహనాల వివరాలు.

ఎన్‌ఓసీ/ క్యూఆర్ కోడ్ డౌన్లోడ్ చేసే విధానం

కమిటీ సభ్యులు వెబ్‌సైట్‌లోకి వెళ్లి మొబైల్ నంబర్ నమోదు చేస్తే నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ ఎన్‌ఓసీ/క్యూఆర్ కోడ్‌ను ప్రింట్ తీసి, లామినేషన్‌తో మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. తనిఖీకి వచ్చే అధికారులు వాటిని పరిశీలిస్తారని వివరించారు.

యువతులపై గంజాయి మూక దాడి

- టీడీపీ నేత అండతో హత్యాబెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుల ఆందోళన
- గంజాయి తాగేందుకు తన తండ్రి డబ్బు ఇవ్వలేదని దాడి చేశారంటూ కుమార్తె ఫిర్యాదు
- పోలీసులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ
- న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మహిళలపై జరుగుతున్న దారుణాలకు అంతే లేకుండా పోయింది. అదేమంటే గంజాయి, మద్యం తాగొచ్చి 'చంపేస్తాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారం తమది అంటూ రెచ్చిపోతున్నారు. ఇదే తరహా సంఘటన శుక్రవారం రూరల్ మండలంలోని దాసరిపాలెం గ్రామంలో వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... దాసరిపాలెంకు చెందిన కొరబడి మరియదాసు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయనకు కుమార్తె ఉంది. ఆమె గుంటూరులో ఒక దుకాణంలో కూలీ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మరియదాసు ఇంటి నుంచి రోడ్డుకు వచ్చారు. అదే సమయంలో నాని, చిన్న, కార్తిక్, ఆనంద్, మరికొందరు మరియదాసును మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని అడిగారు. లేవని ఆయన చెప్పారు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న రౌడీమూక దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మరియదాసు కుమార్తె, సోదరి దీనిపై ఆ మూకను నిలదీశారు. దీంతో వారిపైనా దాడి చేసి, నోటికి వచ్చినట్లు దుర్భాషలాడారు. ఇంకోసారి కనిపిస్తే చంపేస్తామని బెదిరించారని బాధితులు ఆరోపించారు. మరియదాసును చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అనంతరం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాసరిపాలెంకు చెందిన సుధీర్ అనే టీడీపీ నాయకుడు జోక్యం చేసుకుని, నిందితులు తమ పార్టీకి చెందిన వారేనని పోలీసులకు చెప్పారని బాధితులు తెలిపారు. దీంతో పోలీసులు సైతం తమనే తిట్టి వెనక్కి పంపారని, స్థానిక ఎమ్మెల్యే మనిషి సుధీర్ కావడంతో అతడు ఏది చెబితే అదే చేస్తామని పోలీసులు అంటున్నారని ఆరోపించారు. కాపాడాలని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

కేఎల్‌యూ డైరెక్టర్‌కు జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారం అందుకుంటున్న డైరెక్టర్ సాయి విజయ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) డైరెక్టర్ పిసిని సాయి విజయ్ శుక్రవారం జాతీయ పురస్కారం అందుకున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారధి వర్మ తెలిపారు. హైదరాబాద్‌లోని నియో కన్వెన్షన్‌లో ఈకే ఉపదేశ మీడియా ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డ్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ అవార్డు సాయి విజయ్‌కు లభించిందని పేర్కొన్నారు. ఈ అవార్డు కోసం దేశవ్యాప్తంగా అనేక నామినేషన్లు అందినప్పటికీ సాయి విజయ్ ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఆయన్ను వర్సిటీ ప్రో వీసీలు డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

అంధుల క్రికెట్ టోర్నీ విజేత 'ఆంధ్రా గ్రీన్'



విజేతగా నిలిచిన ఆంధ్రా గ్రీన్ జట్టు సభ్యులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ రాష్ట్ర అంధుల క్రికెట్ జట్టు కోసం గత మూడు రోజులుగా స్థానిక అరండల్‌పేటలోని ఏసీఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఏపీ, విజువల్లీ బ్లైండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, డిఫరెంట్ డిసేబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్తాధ్వర్యంలో జరిగిన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేత జట్టుగా ఆంధ్రా గ్రీన్స్ జట్టు నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 42 మందిని ఎంపిక చేసి ఆంధ్రా బ్లూ, ఆంధ్రా ఎల్లో, ఆంధ్రా గ్రీన్ పేరుతో పోటీలను నిర్వహించారు. ఆంధ్రా గ్రీన్ విజేతగా నిలిచింది. వీసీఈఏ అధ్యక్షుడు జి.రవీంద్ర బాబు ముఖ్య అతిథిగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో క్రికెట్‌కు అండగా నిలుస్తున్న రామకృష్ణ పరమహంస, మోటివేషనల్ స్పీకర్ శ్రీధర్‌బాబు, మాజీ బ్లైండ్ క్రికెటర్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి విజేతలకు ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రికెటర్లను ప్రోత్సహించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున పంపిస్తామని తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కొలగాని శ్రీనివాసరావు, ఎల్వీఆర్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు పూర్ణచంద్రరావు మృతి



దుగ్గిరాల: భారత స్వాతంత్య్ర సమరయోధులు సంకా పూర్ణచంద్రరావు (106) శుక్రవారం మండలంలోని ఈమని గ్రామంలో ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఉప్పు సత్యాగ్రహం, గ్రంథాలయ ఉద్యమాలలో ఆయన పాల్గొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె సంతానం. పూర్ణచంద్రరావు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

విత్తన, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు

రూ.4.85 లక్షల విలువైన ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేత



పట్నంబజారులోని ఓ షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహనరావు, ఏఓ సునీత తదితరులు

కొరిటెపాడు (గుంటూరు): నగరంలోని పలు విత్తన, ఎరువులు, పురుగు మందుల షాపుల్లో శుక్రవారం వ్యవసాయ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వివిధ కంపెనీలకు చెందిన రూ.4.85 లక్షల విలువ గల అనుమతులు లేని 168 లీటర్ల పురుగు మందులు, 60 కిలోల పౌడర్ల అమ్మకాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా గుంటూరు ఏడీఏ ఎస్.మోహనరావు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలతో పాటు, అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాలకు వ్యతిరేకంగా వ్యాపారాలు చేసే వారి లైసెన్సులను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎంఆర్‌పీ ధరలకు విక్రయించాలని సూచించారు. విధిగా షాపుల ముందు ధరల పట్టిక, స్టాక్ బోర్డులను ప్రదర్శించాలన్నారు. ప్రతి వ్యాపారి రిజిస్టరు నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు సుజాత, కిషోర్, సునీత, లక్ష్మి, సుజన బేగం తదితరులు పాల్గొన్నారు.

అసెస్‌మెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేయాలి

డీఈవో కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తెచ్చిన అసెస్‌మెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ.. ఈ విధానం కారణంగా విద్యార్థులు 50 నుంచి 70 గంటల బోధనా పీరియడ్స్ నష్టపోతున్నారని, ఆగస్టు నెలలో సిలబస్ పూర్తవ్వకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఈ విధానం తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ఒకటో తరగతి విద్యార్థికి ఓఎంఆర్ షీట్ ఇవ్వడం పనికి రాని చర్య అన్నారు. ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాల నుంచి ఒక్క ప్రశ్న సైతం ఇవ్వకుండా ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో పరీక్షకు ఎనిమిది పేపర్లతో ప్రశ్నపత్రాలను సిద్ధం చేయడం చేయడం ఉపాధ్యాయులకు పెద్ద పరీక్షలా ఉందన్నారు. విద్యార్థుల మార్కులు ఐదు చోట్ల నమోదు చేయాలనడం తగదన్నారు. అనంతరం డీఈవో సీవీ రేణుక, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు పి.లక్ష్మీనారాయణ, పి.పార్వతి, ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, బి.సాయిలక్ష్మి, వెంకటేశ్వరావు, కిషోర్ షా, రాంమోహన్, శివరామకృష్ణ, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రీ సర్వే పనులను అధికారులు నిరంతరం సమీక్షించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన వీడియో సమావేశంలో మాట్లాడుతూ.. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పెద్ద గ్రామాలు, మండల హెడ్‌క్వార్టర్స్‌లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే జరగని గ్రామాల్లో సిబ్బందిని ఎక్కువ పీపీఎంలో ఉన్న గ్రామాలకు కేటాయించి, అదనపు టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి టీమ్‌కు కనీసం 50 ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్‌లను గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేసేలా చూసుకోవాలని చెప్పారు. అదేరోజు వ్యూజీ ఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేయడం తప్పనిసరి అన్నారు. ఇంజినీరింగ్, డిజిటల్ సహాయకులకు సర్వేయర్ ద్వారా వ్యూజీ ఐఎస్‌పై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవోలు మండల స్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్, డీఆర్వో ఖాజావలి పాల్గొన్నారు.

నగదు కోసం యాచకుడి హత్య

నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: నగదు కోసం యాచకుడైన వృద్ధుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ ఎస్. రమేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాచకుడు వెంకటనారాయణ(70) జూన్ 8న రాత్రివేళ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం హత్యకు గురైనట్లు నిర్ధారించి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా దర్యాప్తు చేపట్టారు. అవనిగడ్డ మండలం లంకమాన్యం ప్రాంతానికి చెందిన నిందితుడు కొల్లి రాజేష్‌ను అరెస్టు చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని సాయిబాబా గుడి వెనుక ఓ టింబర్ డిపో వద్ద నిద్రించిన వృద్ధుడి వద్ద రూ.3 వేల నగదు ఉంది. ఈ విషయం గమనించిన రాజేష్ అతడిపై దాడి చేసి హతమార్చి నగదుతో పారిపోయాడు. దీంతో అతడిని అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, కానిస్టేబుళ్లు మురళి, జయకర్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నెహ్రూనగర్: దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్కాలర్‌షిప్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తుందని అర్హులైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కదులుతున్న రైలుపైకి భార్యను నెట్టిన భర్త

- బాధితురాలికి తీవ్ర గాయాలు
- ఆసుపత్రికి తరలింపు



వెంకటేశ్వరరావు



తీవ్ర గాయాలతో స్పృహతప్పి పడిపోయిన అంజలి

తాడేపల్లి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను రన్నింగ్‌లో ఉన్న ట్రైన్‌పైకి తోసివేసిన ఘటన శుక్రవారం తాడేపల్లి గేటు సెంటర్‌లో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... నూజివీడుకు చెందిన వెంకటేశ్వరరావు, అతని భార్య అంజలి కొంతకాలంగా తాడేపల్లిలో నివసిస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం విడాకులు కూడా తీసుకుని వేరువేరుగా ఉంటున్నారు. ఇటీవల కలసి జీవనం కొనసాగిస్తున్నారు. అంజలి తాడేపల్లి సలాం సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం బైపాస్‌రోడ్‌లో ఉన్న ఓ హోటల్‌లో పని చేసేందుకు వెళుతోంది. గేటు సమీపంలో భర్త వెంకటేశ్వరరావు తారస పడ్డాడు. అదే సమయంలో రైలు వెళుతుండగా భర్త ఆమె జుట్టు పట్టుకుని వేగంగా వెళుతున్న రైలు మీదకు నెట్టాడు. రైలు ఢీకొనడంతో అంజలి తీవ్ర గాయాలతో అక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు 108కు ఫోన్ చేసి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పారిపోతున్న వెంకటేశ్వరరావును పట్టుకుని తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.